# తల్లి మనసు

"టైమై పోయింది శశీ! వెళ్తున్నాను." అనేసి సైకిల్ బెల్లు మోగించి వెళ్ళిపోయాడు శివరాం, శశి లోపల్నించి "వచ్చేస్తున్నా" అంటోన్నా విన్పించు కోకుండా.

అన్నం వార్చేసి పొయ్యి అలాగే వదిలేసి గబగబా వీధిగుమ్మం దగ్గరికి వెళ్ళింది శశిరేఖ.

ఎదరింటి వాళ్ళ పిల్లవాణ్ణి గాలిలోకి ఎగరేసి ముద్దులు పెట్టుకుంటున్నాడు శివరాం! ఆ పిల్లవాడి బుగ్గలు నిమురుతూ నవ్వుతూ ఏదో పల్కరించాడు. మళ్ళీ ఒకసారి ముద్దు పెట్టుకుని వాళ్ళమ్మ చేతికిచ్చి చెయ్యివూపి సైకిలెక్కి దూసుకుపోయాడు.

గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి వచ్చేసింది శశిరేఖ. డబ్బాలోంచి కందిపప్పు తీసి పొయ్యిమీద పడేసింది.

ఉయ్యాలలో నిద్రపోతున్న బిడ్డని చూస్తోంటే కళ్ళు చెమర్చినట్టయింది. రెప్పలల్లార్చి కన్నీటిని కళ్ళ లోనే ఇంకించుకుంది.

ఒక్క పది నిముషాల కిందట .... "కొంచెం వీణ్ణి పట్టుకోండి" అని పిల్లాణ్ణి ఇవ్వబోతే, "అమ్మో!" అని కెవ్వున అరిచినంత పనిచేశాడు. "వెధవ చీమిడి ముక్కూ వాడూనూ అధరామృతం కారింది కారినట్టే, వుంటుంది. ఇప్పుడే ఇస్త్రీ బట్టలు వేసుకున్నాను, అన్నీ ఖరాబు చేస్తాడు" అంటూ రెండడుగులు వెనక్కి వేశాడు.

శశి నవ్వుతూ ఏమిటి చెంగుతో కొడుకు ముక్కూ మొహం తుడిచి —— "ఇప్పుడు చూడండి. ఎంత నీటుగా వున్నాడో!" అంది.

"ప్లీజ్! ఉయ్యాల్లో వేసెద్దూ! వాణ్ణి నమ్మలేం" అంటూ బతిమాలుతున్నట్టు చూశాడు.

శశి నవ్వి బాబుని పడుకోబెట్టి "అన్నం వుడికి పోయిందో ఏమో" అనుకుంటూ వంటగదికేసి వెళ్ళి పోయింది.

"టైమైపోతోంది శశీ!" అంటూ కేకేసి హడావుడిగా పరిగెత్తాడు.

తీరా శశి వచ్చి చూస్తే కనపడ్డ దృశ్యం అదీ! ఎదరింటి వాళ్ళ పిల్లవాణ్ణి గాలిలోకి ఎగరేసి .... చేతుల్లోకి అందుకుని .... ముద్దు లాడి .... బుగ్గలు నిమిరి .... చెయ్యివూపి!

అలాంటి దృశ్యం ఇదివరకు కూడా రెండుసార్లు చూసింది. మొదట్లో కుతూహలంగా చూసింది.

"వాళ్ళ పిల్లాడు బాగుంటాడు కదూ?" అని శివరాం అంటే "బాగానే వుంటాడు" అంది మనస్ఫూర్తిగానే.

వాళ్ళ పిల్లాడు తెల్లగా బొద్దుగా, బంతిలా వుంటాడు. ఆ తల్లి దండ్రులిద్దరూ తెలుపే. శశి కొడుక్కి శశిరంగె వచ్చింది. చామనఛాయ.

రెండు మూడు సార్లు ఆ తెల్ల పిల్లవాణ్ణి శివరాం స్వయంగా ఎత్తుకుని ఇంటికి తీసుకువచ్చాడు. "ఇంట్లో తినడానికేమైనా వున్నాయా శశీ?" అని అడిగితే "ఏం వున్నాయి? బెల్లం ముక్క పెట్టనా?" అంది శశి నవ్వుతూ.

ఆ మర్నాడే కాబోలు శివరాం బిస్కెట్ల పేకెట్టు తీసుకొస్తే —— ఆశ్చర్యపోయి —— "ఇదేవిఁటి? మన వాడు అప్పుడే బిస్కట్లు తింటాడా?" అంది.

"అబ్బే! వాళ్ళ బుజ్జికోసం తెచ్చాలే" అని .... బయటికి వెళ్ళేటప్పుడు ఆ పేకెట్టు కూడా పట్టు కెళ్ళాడు.

"మన వెధవ తినేసరికి ఇలాంటివి ఎన్ని తెచ్చుకోవాలో!" అంది తనూ వీధిగుమ్మందాకా వెళ్తూ.

కానీ శశి మనస్సు అంత తేటగా ఎంత కాలం వుండగలదు?

శివరాం .... పరాయి పిల్లాణ్ణి అంత ఆప్యాయంగా ముద్దులు పెట్టుకుంటోంటే కళ్ళారా చూసే శశి .... ఏదో ఆవేదనతో "ఇది అసూయ కాదు గదా?" అని తనని తను ప్రశ్నించుకుంది. పసిబిడ్డని .... ఎవరి బిడ్డ కానీ .... ముద్దు పెట్టుకున్నంత మాత్రాన తను ఇలా

బాధపడాలా? శివ రాంని అపార్థం చేసుకోకూడదన్న ఆలోచన శశిని అప్పుడు కాస్త నిశ్చితంగా వుండ నిచ్చింది.

కానీ .... పసిబిడ్డల్ని ప్రేమించటమే అతని తత్వం అయితే, ఆ ప్రేమ తన బిడ్డ మీద వుండదా? తన బిడ్డమాత్రం పసివాడు కాదా? పైగా, ఎప్పుడూ ఏదో అనారోగ్యంతో బాధపడుతూ వుంటాడు. అలాంటి బిడ్డని ఇంకా ముద్దుగా చూసుకోవద్దా? ప్రేమ అంతా పరాయి పిల్లాడి మీదేనా? అది కూడా తెల్లగా వున్నాడనేనా?

ఆ రోజు .... శశి మళ్ళీ అదే దృశ్యం చూసింది!

తన పిల్లవాణ్ణి, ఏడాది కూడా నిండని పసివాణ్ణి, అర్భకంగా అనారోగ్యంగా వున్న స్వంతబిడ్డని ముట్టు కునే ధ్యాసేలేని మనిషి, పొరుగింటి పిల్లవాణ్ణి నవ్వుతూ ముద్దులాడుతోంటే .... తను సహించాలా? చూస్తూ ఆనందించాలా? ఆనందించకపోతే తను అసూయపడ్డట్టా?

తన బిడ్డని చూడగానే తండ్రి కళ్ళల్లో జ్యోతులు వెలగాలి! బిడ్డ కోసం తండ్రి చేతులు ముందుకు సాగాలి! కన్న తండ్రి అయిన మనిషి, ముందు చెయ్యా వలసింది ఊళ్ళో వాళ్ళ పిల్లలు ఎర్రగా బుర్రగా వున్నా రని వాళ్ళని ఎత్తుకుని ఎగరెయ్యడం కాదు; తన బిడ్డని గుండెలకు హత్తుకోవాలి!

రోజంతా అదే ధ్యాసగా వుంది శశికి,

రాత్రి, అన్నం తినేసి గదిలోకి వెళ్ళిపోయాడు శివరాం. శశి అన్నం తినాలి కదా, పిల్లాణ్ణి ఎత్తుకోవా లేమో అన్న ధ్యాసేలేదు.

శశి పళ్ళెంలో అన్నం పెట్టుకుంది. ఉయ్యాల ఒకసారి వూపివచ్చి అన్నం ముందు కూర్చుంది. రెండు ముద్దలు తిన్నదో లేదో పిల్లాడు లేచాడు. ఏడుపు మొదలుపెట్టాడు. శశి అన్నం పళ్ళెం మీద మూతపెట్టి గబగబా చెయ్యి కడుక్కుని పిల్లాణ్ణి తీసుకుని భుజం మీద వేసుకుంది.

శివరాం వచ్చాడు గదిలోంచి. "లేచాడా? ఉయ్యా ల్లోనే పడుకోబెట్టు. నేను ఊపుతాలే. నువ్వు తొందరగా తినేసి రా!"

"చాలా సేపట్నించీ పడుకునే వున్నాడు. కాస్సేపు ఎత్తుకోండి. అన్నం తినేసి వస్తాను" అంటూ పిల్లాణ్ణి అందించబోయింది.

"అబ్బా! నేనిప్పుడు ఎత్తుకోలేనుగానీ పడుకో బెడుదూ! నేను చూస్తూ వుంటాగా?" అన్నాడు.

పిల్లాణ్ణి చప్పున అందుకోకుండా, పిల్లాడికోసం చేతులు చాపకుండా నించున్న భర్తని చూస్తే శశికి మనసు భగ్గు మంది. "చూస్తూ వుంటారా? ఎంత జాలి! కన్నబిడ్డ, ఆ మాత్రం ముట్టుకోడానికి తగడనుకుంటు న్నారా? పరాయి పిల్లాడి పాటి చెయ్యడనుకుంటు న్నారా?" అంటూ పిల్లాణ్ణి మళ్ళీ భుజం మీద వేసుకుంది.

అర్థంకానట్టు చూశాడు శివరాం— "అదేమిటి? ఎందుకలా అన్నావు?"

"ఎందుకో అన్నాను. మతిపోయి అన్నాను."

"పరాయి పిల్లలెవరు? ఎవర్నెత్తుకున్నాను నేను?"

"లేదు, ఎవర్నీ ఎత్తుకోడం లేదు. మీరు ఎవర్నీ ముద్దులాడ్డం లేదు. నేనే ఉత్తపుణ్యానికి అంటు న్నాను!"

"ఓహో! వాళ్ళ బుజ్జిని అప్పుడప్పుడూ ఎత్తుకుంటా ననా?" అని ఆశ్చర్యపోతున్నట్టు చూశాడు.

"అప్పుడప్పుడూ ఏం ఖర్మ? ఎప్పుడూ ఎత్తుకుని తిరగండి!"

"మాట్లాడేదేదో తిన్నగా మాట్లాడరాదూ?"

శశి కోపంతో రెచ్చిపోతూ అంది. "ఇంకా ఏం తిన్నగా? ఎంత తిన్నగా? పొద్దున్నకి పొద్దున్న వీణ్ణి ఎత్తు కోమంటే బట్టలు పాడు చేస్తాడని వంకలెట్టి తప్పించు కున్నారు. వస్తున్నా నుండమంటున్నా విన్పించుకో కుండా టైమైపోతోందని హడావుడిగా పరిగెత్తారు. తీరా గుమ్మం దాటింతర్వాత మీరు చేసిందేమిటి? ఆ పిల్లవాణ్ణి గాలిలోకి ఎగరేసి బంతులాట ఆడటానికి టైమెక్కణ్ణించి వచ్చింది? వాడు మీ బట్టలు పాడు చెయ్యడన్న నమ్మకం ఏమిటి? .... పొద్దున్నే కాదు, ఇంతకు ముందు కూడా చూశాను. చూసినప్పుడల్లా నేనెంత ఆశ్చర్యపోయానో తెలుసా? మీకై మీరు .... ఒక్కసారన్నా బాబుని ఎత్తుకున్నారా? 'ఒక్కసారి పట్టుకోండీ, పని చేసుకోవాలీ' అని నేనిస్తే కూడా, అంటీ అంటనట్టు పట్టుకుంటారు? ఐదు నిమిషా

లన్నా ఎత్తుకోకుండా 'అబ్బా పడుకోబెట్టు' అని పక్క మీద పడేస్తారు. మరి బైటికి వెళ్ళేటప్పటికి పరాయి వాళ్ళ పిల్లాడి మీద అంత ముద్దు ఎలా వొస్తుంది? చేసేది తెలీనట్టు, ఇంకేం తి .... న్న .... గా చెప్పాలి మీకు?"

శివరాం ఆశ్చర్యపోయాడు. శశి మాటలకు కోపం కూడా వచ్చింది — "ఏవన్నా మతి వుండే మాట్లాడు తున్నావా? ఆ బుజ్జిగాడు, తెల్లగా, బొద్దుగా, ఉంగరాల జుట్టూ వాడూ చూడగానే ముద్దొస్తాడు. వాణ్ణి చూస్తే నేనేకాదు, అందరూ ముద్దులు పెట్టుకుంటారు. అదే పెద్ద తప్పొచ్చిందా?" అన్నాడు రుసరుసలాడుతూ.

నిర్ఘాంతపోయినట్టు చూసింది శశి. వాళ్ళ పిల్లాడు తెల్లగా, బొద్దుగా వుంటాడా! అందుకని వాడు ముద్దొస్తాడా! వాణ్ణి ఎత్తు కుంటారా!

శశి మారుమాట్లాడకుండా పిల్లాణ్ణి తీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తెల్లబోయాడు శివరాం అక్కడే నించున్నాడు కొంతసేపు. తర్వాత నెమ్మదిగా వంటింటి గుమ్మంలోకి వెళ్ళాడు.

శశి అన్నం తింటోంది, పిల్లాణ్ణి ఒళ్ళో పెట్టుకుని.

"ఇలాగియ్యి, ఎత్తుకుంటాను" అంటూ పిల్లాణ్ణి తీసుకోబోయాడు.

"అక్కర్లేదు. నా అన్నం అయిపోయింది. మీరు వెళ్ళండీ. నేను చూసుకుంటాను" అంటూ పళ్ళెంలో చెయ్యి కడిగేసుకుంది.

శివరాం గదిలోకి వెళ్ళిపోయాడు.

★ ★ ★

మర్నాడు పొద్దున్న — బద్ధకంగా లేచి గది లోంచి బయటికి వచ్చాడు శివరాం.

వంటింటి గడప దగ్గిర చాపమీద నించి జరిగి నేలమీద తడిలో దొర్లుతున్నాడు పిల్లాడు. శశి, పొయ్యి దగ్గిర పనిలో మునిగి పిల్లాణ్ణి చూడనేలేదు.

శివరాం వచ్చిన చప్పుడికి తల తిప్పి చూసింది.

శివరాం, పిల్లాణ్ణి చాపమీద పడెయ్యడానికి రెక్క పట్టి ఎత్తబోయాడు.

చప్పున శశి పిల్లాణ్ణి అందుకుని, ఎత్తుకుని, పమిట చెంగుతో పిల్లాడి ఒళ్ళంతా తుడుస్తూ "తొందరగా వెళ్ళి మొహం కడుక్కోండి. ఇడ్లీలు చల్లబడి పోతాయి" అంది.

"రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు శశీ!" అంటూ శివరాం మొహం కడుక్కోడానికి వెళ్ళాడు.

పిల్లాణ్ణి చాపమీద పడుకోబెట్టి శశి మళ్ళీ పనిలో పడింది.

శివరాం, మొహం కడుక్కుని వచ్చి ఇడ్లీ ప్లేటు అందుకుని పిల్లాడి పక్కన చాపమీద కూర్చున్నాడు. తినడం పూర్తిచేసి ప్లేటు బైటపెట్టి చేతులు కడుక్కుని వచ్చేప్పటికి పిల్లాడు చాపమీద బోర్లాపడి నుదురు నేలకి కొట్టుకుని కేరుమన్నాడు.

శివరాం, వొంగి కొడుకుని తియ్యబోతోంటే శశి అప్పటికే పిల్లాణ్ణి అందుకుంది. వాణ్ణి ఎత్తుకుని నుదురు నిమిరి బుజ్జగిస్తూ దూరంగా తీసుకు పోయింది.

"శశీ! వాణ్ణి కాసేపు నాకియ్యి! నువ్వు పని చేసుకో" అన్నాడు శివరాం.

"ఫర్వాలేదు. నెమ్మదిగా చేసుకుంటాను. మీరు స్నానానికి వెళ్ళండి. మళ్ళీ ఆఫీసుకి లేటైందంటారు."

"నువ్వు బియ్యం ఏరుతున్నావుగా? ఇలా ఇయ్యి వాణ్ణి."

"ఫర్వాలేదు. వాడికి పాలుకూడా ఇవ్వాలి. పాలు తాగి చాలా సేపైంది" అంటూ పిల్లాణ్ణి ఒళ్ళో పెట్టుకుని, బియ్యం చేట పక్కన పెట్టుకుని కూర్చుంది.

"వాడి ఒళ్ళు వెచ్చగా అనిపించిందే ఇందాక. జ్వరం వచ్చిందా?"

"కొంచెం వెచ్చబడ్డట్టే వుంది."

శివరాం స్నానానికి వెళ్ళాడు. తిరిగివచ్చి తన పను లన్నీ చేసుకుని ఆఫీసుకి బైల్దేరాడు.

శశి, వెనకాల వెళ్ళలేదు. వీధి వేపు చూడలేదు.

సాయంత్రం ఇంటికి వస్తూనే "బాబుకి జ్వరం తగ్గిందా?" అని అడిగాడు.

"బాగానే వుంది" అంది శశి ముభావంగా.

"ఏమిటి బాగానే వుంది? జ్వరమా?" అన్నాడు శివరాం నవ్వు మొహంపెట్టి.

శశి మాట్లాడలేదు.

శివరాం ఉయ్యాల దగ్గిరికి వెళ్ళి పిల్లాడి ఒంటి మీదచెయ్యిపెట్టి చూశాడు. వెచ్చగానే వుంది వొళ్ళు.

"శశీ! బాబుకి మందేశావా?"

"ఆఁ, వేశాను."

శివరాం బట్టలు మార్చుకుని పేపరు తీసుకుని కూర్చున్నాడు.

పిల్లాడు లేచినప్పుడల్లా శశే హాజరై ఉయ్యాల ఊపి, లేకపోతే లేవదీసి ఎత్తుకుని సముదాయిస్తూ, వాకిట్లో తిప్పుతూ, ఎత్తుకునే పనంతా చేసుకుంది.

రాత్రి శివరాం స్నానంచేసి వచ్చేప్పటికి "అన్నం వడ్డిస్తాను, వస్తారా" అని పిలిచింది.

"ఇద్దరం కలిసి తిందాంలే, వాణ్ణి నిద్రపోనీ!" అన్నాడు.

"ఫర్వాలేదు. ముందు మీరు తినండి. నేను తర్వాత తింటాను" అనేసి లోపలికి వెళ్ళి అన్నం వడ్డించింది.

శివరాం లేచి వెళ్ళాడు. భోంచేస్తూ ఆఫీసు కబుర్లేవో చెప్పాడు. కూరల్ని పొగిడాడు. ఉన్నట్టుండి "ఏం, అంత ముభావంగా వున్నావ్?" అన్నాడు.

"అబ్బే! ఏం లేదు. మీరేదో చెప్తొంటే వింటు న్నాను" అంది.

"నువ్వూ అన్నం పెట్టుకో."

"మీ పళ్ళెం తీసేసి కూర్చుంటాను."

రెట్టించలేదు శివరాం. చెయ్యి కడుక్కుని లేచాడు. వీధి గుమ్మంలోకి వెళ్ళాడు.

ఎదరింటి దంపతులు కొడుకుని ఆడిస్తూ వీధి వాకిట్లో కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. ఆ సందు, సాయంత్రం అయ్యేసరికి నిర్మానుష్యంగా, ప్రశాం తంగా వుంటుంది. భోజనాలు చేసి ఆడవాళ్ళూ, మగ వాళ్ళూ కాస్సేపు ఆరుబయటికి వచ్చి ఒకళ్ళని ఒకళ్ళు పలకరించుకుంటారు అప్పుడప్పుడూ.

శివరాంని చూస్తూ ఎదరింటావిడ "రండి అన్నయ్యగారూ! వదినెగారింకా భోం చెయ్యలేదా?" అంటూ పలకరించింది. చంకలో వున్న కొడుకుతో "బుజ్జీ! మామయ్యగా రొచ్చార్రా! వెళ్ళు, ఎత్తు కుంటారు" అంటూ పిల్లాణ్ణి చనువుగా శివరాంకి అందించింది.

శివరాం బుజ్జిని ఎత్తుకున్నాడు.

ఆవిడ భర్తకేసి చూస్తూ "మన బుజ్జి అంటే అన్నయ్య గారికి ఎంత ఇష్టమో! ఈ వెధవని ఎత్తుకోక పోతే ఆయనకు తోచదో యేమిటో అనుకుంటాను" అంటూ నవ్వింది.

శివరాం నెమ్మదిగా బుజ్జిని వాళ్ళ నాన్నకి అందిస్తూ "మా వాడికి కొంచెం ఒంట్లో బాగా లేదు. లేస్తాడేమో! వాళ్ళమ్మ అన్నం తింటోంది" అంటూ గబగబా లోపలికి వచ్చేశాడు.

శశి, పిల్లాణ్ణి భుజంమీద వేసుకుని తిప్పుతోంది. అన్నం తింటూ తింటూ లేచినట్టుగా పళ్ళెంలో మజ్జిగ అన్నం వుంది.

"వాణ్ణి ఇలా గియ్యి! నువ్వు అన్నం తిను!" అంటూ శివరాం పిల్లాణ్ణి తీసుకోబోయాడు.

"వొద్దు, మీ దగ్గిర వుండడు. ఫర్వా లేదు. వాడు నిద్రపోయాక తింటాను" అంటూ అన్నం పళ్ళెం మీద ఒక ప్లేటు మూతపెట్టింది.

"నేనెత్తుకుంటాగా? తొందరగా తెమల్చుకుని రారాదూ?" అంటూ శివరాం పిల్లాణ్ణి మళ్ళీ తీసుకో బోయాడు.

"వొద్దులెండి. మీ దగ్గిర వుండడు. వాడికసలే ఒంట్లో బాగాలేదు."

"ఎందుకుండడూ? వాడికేం తెలుసు?"

"తెలుస్తుంది. ఎవరెత్తుకున్నారో వాడికి తెలు స్తుంది."

"తెలిస్తే తెలిసిందిలే. వాడే వుంటాడు" అని శివరాం పిల్లాణ్ణి బలవంతంగా తీసుకోబోయాడు.

పిల్లాణ్ణి ఇవ్వకుండా శశి కోపంగా "వొద్దు, వొద్దని చెప్పాగా?" అంది.

"ఏంటి శశీ నువ్వు? పొద్దున్ననించీ చూస్తున్నాను. పిల్లాడికి నా చిటికెన వేలు కూడా అంటనివ్వకుండా చేస్తున్నావు. నేను గ్రహించలేదనుకుంటున్నావా?" అంటూ శివరాం కూడా కోపంగా చూశాడు.

"గ్రహిస్తే మంచిదే. ఏమిటి మీరు గ్రహించింది? పిల్లాణ్ణి అంటకుండా ముట్టకుండా మీరు చేసు కున్నారా, నేను చేస్తున్నానా? వాణ్ణి ముట్టుకోడం మీకే ఇష్టం లేదు. మీకిష్టం లేనిపని మీరు చెయ్యొద్దు. అదే

నేననేది."

"పిల్లాణ్ణి ముట్టుకోడం నాకిష్టంలేదా! ఎవరన్నారు?" అన్నాడు శివరాం తెల్లబోతూ.

"ఎవరో అంటే నాకెందుకూ? ఎవరో అంటే నేను నమ్మను, నేనూరుకోను. మీరే అన్నారు. పిల్లలంటే తెల్లగా వుండాలి. బొద్దుగా వుండాలి. ఉంగరాల జుట్టు వుండాలి. అలావున్న పిల్లలే ముద్దొస్తారని మీరే అన్నారు. అప్పటి దాకా నేనేవిటో తెలివి తక్కువ దానిలాగా, కన్నపిల్లలు ఎలా వున్నా తల్లిదండ్రులకు ముద్దొస్తారేమో అనుకుంటున్నాను. కాకి పిల్ల కాకికి ముద్దు కదా అనుకుంటున్నాను. నాదే పొరపాటు. నల్లగా, పీలగా, అర్భకంగా వున్న పిల్లలేం ముద్దొస్తారు? వాళ్ళని ఎత్తుకోవాలని ఎలా అనిపిస్తుంది? అలాంటి పిల్లల్ని గతిలేక పెంచవలసిందేగానీ ప్రేమతో పెంచగలమా? తల్లిని కాబట్టి నాకీ చాకిరీ తప్పదు. మీకు కూడా ఎందుకీ బాధ? తెల్లగా, బొద్దుగా, ముద్దుగా వున్న పిల్లలు ఎక్కడెక్కడున్నారో చూసుకుని వాళ్ళని ఎత్తుకోండి. వీడి సంగతి నేను చూసుకుంటాను. మీరింక వీణ్ణి ముట్టుకోవద్దు!"

శివరాం నిర్ఘాంత పోతూ చూశాడు — "ముట్టుకోవద్దని చెప్పడానికి నువ్వెవరివి? వీడు నీకే కాదు నాకూ కొడుకే. ఎత్తుకోవద్దని నువ్వంటే నేను మానతానా?" అన్నాడు ఉక్రోషంగా.

"మీ కొడుకా?" అని ఆశ్చర్యపోయింది శశి.

"నల్లగా, పీచుజుట్టూ .... తెగుళ్ళ కొంటి పిల్లాడు మీ కొడుకా? ఇలాంటి పిల్లల్ని చూస్తే మీకు అసహ్యం వెయ్యదూ? వీణ్ణి మీ కొడుకని ఎలా చెప్పుకుంటున్నారు? .... పిల్లలు తల్లిదండ్రుల రూపురేఖల తోటే పుడతారు. వీడికో తమ్ముడో చెల్లెలో పుట్టినా వాళ్ళూ ఇలాగే ఏడుస్తారు. మీరసలు వాళ్ళమ్మని ఎంచుకున్నప్పుడే పెద్ద పొరపాటు చేశారు. ఇప్పుడు విచారించి ఏం లాభం? ఇక మీరు పరాయి వాళ్ళ పిల్లల్ని చూసి సంతోషపడాల్సిందే. మీ సంగతి ఆలోచిస్తే నాకూ బాధగానే వుంది. కానీ, నేనేం చెయ్యను? నా చేతిలో ఏ ముంది?"

శశి కోపానికి తెల్లబోతున్నాడు శివరాం. "శశీ! నీ అందచందాల గురించి నేనెప్పుడన్నా చులకనగా మాట్లాడానా?"

"నా గురించి మాట్లాడకపోతేయేం, నా కడుపున పుట్టిన బిడ్డ గురించి చులకనగా మాట్లాడితే అది నా గురించి మాట్లాడినట్టు కాదా? నల్లగా వుండడం నా కొడుకు తప్పా? అర్భకంగా వుండడం వాడి తప్పా? వాడేం తప్పు చేశాడని, ఎదురింటి పిల్లాడికన్నా చులకనైపోయాడు? పోనివ్వండి! మీకు నచ్చ లేదు కాబట్టి, వాణ్ణి మీరెప్పుడూ ముట్టుకోవద్దు. నేనొప్పుకోను. నా బిడ్డ ఎలా వున్నా వాడు నాకు గొప్ప పెన్నిధి! వాణ్ణి నేనే నా గుండెల్లో పెట్టి పెంచుకుంటాను. మీరు ఎత్తుకోడం లేదని మిమ్మల్ని నేను తప్పు పట్టను."

శివరాం సిగ్గుపడుతున్న వాడిలాగా నిలబడ్డాడు. శశి మాటలన్నీ విన్నాడు. "శశీ! నిజంగానే నేను తెలివి తక్కువగా మాట్లాడాను. తెలివి తక్కువగానే చేశాను. బాబుకి నువ్వు నిజంగా మంచి తల్లివి! నేను మంచి తండ్రిని కాను. దానికి నేనే సిగ్గుపడాలి. శశీ! .... నన్ను క్షమించెయ్యి! వెళ్ళు, అన్నం తిను. బాబుని నేనెత్తుకుంటాను" అంటూ శివరాం పిల్లాణ్ణి తన చేతుల్లోకి తీసుకుంటోంటే శశి వారించ లేదు. పమిటితో కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళింది.

['యువ' మాసపత్రికలో బహుశా 1965 ప్రాంతాలు కావచ్చు] ★